క్లుప్తంగా

తీరిన రోడ్డు సమస్య



భరత్ నగర్‌లో రోడ్డు నిర్మాణానికి గరుసు తోలుతున్న దృశ్యం

ఆదోని రూరల్ : మండలంలోని మండిగిరి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని భరత్‌నగర్‌లో కొన్నేళ్లుగా రోడ్డు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి సమస్యను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు దీంతో ఆదివారం కాలనీలో గరుసు తోలించి చదును చేయించారు. శేషిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కాలనీలో తాగునీటి పైపులైన్లు, డ్రైయినేజీ కాలువల నిర్మాణాలు పూర్తి చేశామని చెప్పారు. త్వరలో సీసీ రోడ్లు వేయిస్తామని తెలిపారు.

ప్రమాద బాధితులకు సహాయం చేద్దాం

ఆదోని అర్బన్ : రోడ్డు ప్రమాద బాధితులకు వెంటనే చికిత్స అందేలా చేసి ప్రాణాలు కాపాడాలని ఎంవీఐ సిసిరాదీప్తి, ఏఎంవీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులు, స్థానికులకు 'ప్రమాద బాధితులకు సాయం అందించి ప్రాణాలు కాపాడుదాం' అనే అంశంపై డాక్టర్లతో కలిసి అగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ 'గుడ్ సమరిటన్' (మంచి సమరయుడు) కార్యక్రమం ద్వారా ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిన బాధితులకు సాయం అందించి ప్రాణాలు కాపాడాలన్నారు. అంతేగాకుండా ప్రమాద బాధితులను రక్షించిన వారిపై ఎటువంటి సివిల్, క్రిమినల్ కేసులు ఉండవని తెలిపారు.

బీమా తక్షణ సాయం అందజేత

పెద్దకడబూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మొట్రు రామాంజనేయులు (39) కొన్ని రోజులుగా అనారోగ్యంతో కర్నూల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి వైఎస్సర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశారు. వారు మాట్లాడుతూ భీమా పథకం ద్వారా మంజూరు అయిన మిగిలిన మొత్తం నామిని బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని, అలాగే త్వరలోనే ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద రూ. 2లక్షలు అందుతాయని చెప్పారు. వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, వలంటీర్ షబ్బీర్‌షావలి పాల్గొన్నారు.

కామ్రేడ్ ధణాపురం నరసింహయ్య మృతి



నరసింహయ్య(ఫైల్)

ఆదోని రూరల్ : సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ ధణాపురం నరసింహయ్య అలియాస్ సూరి ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. అంత్యక్రియలు సోమవారం ఉదయం 11 గంటలకు ధణాపురం గ్రామంలో జరుగుతాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన మృతికి సన్నిహితులు, సహచరులు, బంధువులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలిపారు. తన ఉద్యమ జీవితంలో ఎన్నో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాడని గుర్తు చేసుకున్నారు.

24 నుంచి వాలీబాల్ పోటీలు

ఆస్పరి: మండలంలోని యాటకల్లులో వెలసిన సుంకులమ్మవ్వ ఊరు దేవర సందర్భంగా ఈనెల 24, 25 తేదీలలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం మండల కార్యదర్శి రమేష్ ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 8,016, రెండో బహుమతి రూ. 6,016, మూడో బహుమతి రూ.3,016 వేలు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు సోమవారంలోపు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 62819 71243 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రిజర్వాయర్‌ను నింపుతాం

ఆలూరు: వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి నగరడోణ గ్రామ రిజర్వాయర్ పనులను పూర్తిచేసి చెరువులోకి వివిధ కాలువల ద్వారా వర్షపు నీటిని నింపేందుకు కృషి చేస్తామని హెచ్‌ఎల్‌సీ ఈఈ రమణారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడారు. రిజర్వాయర్ పనులు దాదాపు 50 శాతం పూర్తికావొచ్చాయని చెప్పారు. ప్రస్తుతం స్లూయిస్, కాలువల రీడిజైన్, డీపీలు తదితరులు పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. పనులు వేగవంతం చేసి మూడు నెలల్లోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు ఈఈ రమణారెడ్డి తెలిపారు. పనులు పూర్తయితే నీటి నిల్వ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఏది ఏమైనా త్వరగా పనులు పూర్తి చేయించి ఖరీఫ్‌లో రైతులకు పంటలకు నీరిచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

కోసిగిని సస్యశ్యామలం చేస్తాం

- లిఫ్ట్ ఇరిగేషన్‌తో కోసిగికి పుష్కలంగా సాగు,తాగునీరు
- ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి
- కోసిగి ఎత్తిపోతల పథకానికి భూమి పూజ





భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ,కోసిగిలో బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు

కోసిగి: కోసిగి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రం సమీపంలోని పులికనుమ రిజర్వాయర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్, భూగేని చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఎమ్మెల్యేకు రైతులు, ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. గ్రామ శివారు మోడల్ స్కూల్ నుంచి దాదాపు 300 బైక్‌లతో పులికనుమ రిజర్వాయర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోసిగితో పాటు కౌతాళం, మంత్రాలయం, ఐరన్‌గల్లు, కందుకూరు గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేసినట్లు వివరించారు.

2,500 ఎకరాలు సాగునీరు..

కోసిగి సమీపంలో పులికనుమ పైప్ లైన్ వద్ద రూ.4.50 కోట్ల పులికనుమ మిగులు బడ్జెట్‌తో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తున్నారు. లిఫ్ట్ నుంచి 4.6 కి.మీ. కోసిగి బసవన్న కొండ ప్రాంతం మీదుగా 2.2 అడుగుల పైప్‌లైన్ ఏర్పాటు చేసి కోసిగి, పెండేకల్లు, నేలకోసిగిలోని నాకన్న చెరువు వరకు 2,500 ఎకరాలకు సాగునీటి అందించనున్నారు. అలాగే గ్రామశివారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూగేని చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చెరువు మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారు. పులికనుమ నీటిని నిల్వ చేసి సురక్షితమ మంచి నీటిని అందజేస్తారు. త్వరలోనే జలజీవన్ మిషన్ కింద ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ మురళీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస రెడ్డి, మైనర్ ఇరిగేషన్ డీఈ కిష్టన్న, ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ అయ్యమ్మ, మాజీ సాగునీటి డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, పీఏ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ బెట్టన గౌడ, పార్టీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, మాజీ మండల ఉపాధ్యక్షుడు హాజీ ఉస్మాన్, మహంతేష్ స్వామి, ఇల్లూరి ఆదినారాయణ శెట్టి, మాణిక్యరాజు, నాడుగేని నాగరాజు,కోసిగయ్య, జగదీష్ స్వామి, చెన్నబసవ, సోఫి రజాక్, మంగమ్మ, భీమక్క, దొడ్డి నరసన్న, నరసింహులు గౌడ, కాల్వ లక్ష్మయ్య పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.2.67 లక్షల ఆదాయం

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా టెంకాయలు అమ్ముకునేందుకు హక్కుల వేలం ఆదివారం నిర్వహించగా రూ.2.67 లక్షలు పలికింది. దర్గాలో నిర్వహించిన వేలంలో 7 మంది పాటదారులు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. చివరకు ఆదోనికి చెందిన తహెర్ బాషా రూ. 2.67 లక్షలకు హెచ్చు పాడి ఈ సంవత్సరం టెంకాయలు అమ్ముకునేందుకు హక్కులు దక్కించుకున్నారు. గతేడాది వేలం రూ.2.24 లక్షలు పలకగా ప్రస్తుతం రూ.43 వేలు అదనంగా ఆదాయం లభించింది. గ్రామ పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, క్రిష్ణమూర్తి, మల్లికార్జునరెడ్డి, మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, చిన్నాయప్ప పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ఆదోని అర్బన్ : పట్టణంలోని వైఎంకే నగర్‌లో వెలిసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో షిర్డీ సాయి సత్సంగం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు 300 మందికి దుప్పట్లు అందజేశారు. వీరయ్యస్వామి, టీజీ రాం ప్రసాద్, హరి, వీరలాల్ పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి, పురవీధుల్లో భజనలు చేస్తూ ఊరేగిస్తున్న భక్తులు

ముగిసిన శతజయంత్యుత్సవాలు

- ఘనంగా పాండురంగస్వామి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న బుట్టా రేణుక

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఫారెస్ట్ లైన్ అంబాభవానీ ఆలయంలో వెలిసిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి శతజయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి.. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు. స్వామి,అమ్మవార్లకు వేకువజామున విశేష పూజలు, బంగారు వెండి ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఊరేగింపులో గోవిందా నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బుట్టా రేణుక ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా రుక్మిణీ పాండురంగస్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి పూజలు అనంతరం సన్మానించారు.

విద్యార్థుల కల సాకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం రూరల్: వర్ష కాలంలో చిత్తడిగా మారిన దారులు, వేసవి కాలంలో ఆరుబయట విద్యా బోధనను దృష్టిలో ఉంచుకుని అధికారంలోకి రాగానే శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గతంలో హామీ ఇచ్చారు. హామీలో భాగంగా పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపు, గదుల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి రూ.4 కోట్ల వ్యయంతో 24 గదుల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆదివారం రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండిత కేసరి, మహోపాధ్యాయ రాజా.ఎస్.గిరియాచార్, వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డితో కలిసి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పార్టీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, ఎంఈఓ మొహీనుద్దీన్, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌శెట్టి, పీఎంసీ చైర్మన్ సబ్జల్లి ఉన్నారు.

అలాగే మండలంలోని చెట్నేహళ్లి గ్రామంలో రూ.17.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వై.సీతారామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం వారిని గ్రామస్తులు సన్మానించారు. పీఆర్ డీఈ అశ్వథామ, ఏఈ నరసింహులు, సర్పంచ్ అంజిని, ఉపసర్పంచ్ వీరనాగప్ప, ఎంపీటీసీ సభ్యులు రామాంజనేయులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి..

ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో రోడ్డుభద్రతా వారోత్సవాలకు వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదు

- గుడిసె కృష్ణమ్మ వైద్య చికిత్స పొందాలి
- దాడులన్నింటినీ వైఎస్సార్‌సీపీ పనేనని చెప్పడం దుర్మార్గం
- పదవి కోల్పోవడంతో విమర్శలు
- వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవా

ఆదోని అర్బన్ : గుడిసె కృష్ణమ మానసిక పరిస్థితి సరిగా లేదని, టీడీపీ నాయకులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా సూచించారు. పట్టణంలో ఎవరిపైన దాడి జరిగినా, ఘర్షణలు చోటు చేసుకున్నా తమ పార్టీకి అంటగట్టడం ఆమెకు రివాజుగా మారిందని మండిపడ్డారు. మానసిక స్థితి సరిగా లేనప్పుడే ఇలా అనుకుంటారని ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. స్థానిక అమరావతి నగర్‌లో సికిందర్ అనే వ్యక్తిపై వ్యక్తిగత గొడవల్లో భాగంగా ఎవరో దాడి చేస్తే.. ఆ దాడి వైఎస్సార్‌సీపీ వారే చేశారనడం సరికాదన్నారు. దాడి చేసిన వారెవరో తనకు తెలియదని సికిందర్ చెబుతున్నా ఆమె వినకుండా మీడియా ముందు తమ పార్టీపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఫుడ్ కార్పొరేషన పదవి పోయినప్పటి నుంచి ఆదోనిలో ఏ మూరుమూల గొడవలు జరిగినా అవి తమకే ఆపాదిస్తోందన్నారు. వ్యక్తిగత ఘర్షణలను తమపై రుద్దాలనుకునే చేష్టలకు స్వస్తి పలకాలని సూచించారు. గతంలో కల్లుబావిలో కూడా వ్యక్తిగత విమర్శలు చేసిందని, అలాగే ఆటో డ్రైవర్, మరికొందరు వ్యక్తిగత గొడవలతో దాడులు చేసుకుంటే మా పార్టీ మీదే నింద వేశారన్నారు. తమ పార్టీ ఇలాంటి వాటిని ప్రోత్సహించదని, శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవించాలని కోరుకునేవారమన్నారు. వారి పార్టీలో లాగా గొడవలు సృష్టించడం, గొడవలు చేయడం, ఆరోపణలు చేయడం తమ పార్టీలో లేదన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి



సుంకులమ్మ ఆలయం నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో ఆదివారం ఆస్పరి మండలానికి చెందిన వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా బైలుపత్తికొండ గ్రామంలో సుంకులమ్మ ఆలయం నిర్మాణానికి మంత్రి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, సచివాలయాలకు మంజూరైన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని వారికి సూచించారు. పనులు నాణ్యతతో చేపడుతూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాయకులు నారాయణస్వామి, సర్పంచ్ బీటీ రంగన్న, వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్టు విధానంలోకి మార్చండి

రాష్ట్ర బీమా వైద్య (ఈఎస్ఐ) శాఖ ఏపీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న నర్సింగ్, పారామెడికల్ ఉద్యోగులను కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు ఉద్యోగులు వినతిపత్రాన్ని ఆదివారం అందజేశారు. ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగం చేయడంతో అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నామని ఉద్యోగులు పద్మజారెడ్డి, రామాంజనేయులు, అనురాధ, రాజేష్ తదితరులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని ఆయన హామీఇచ్చారు.

బిల్లులు మంజూరు చేయాలి

ఆదోని అర్బన్ : మున్సిపల్ ఉపాధ్యాయులకు వార్షిక ఇంక్రిమెంట్‌లు, స్పెషల్ గ్రేడ్ తదితర అరియర్స్ బిల్లులు మూడు నెలలుగా నిలిచిపోయాయని, వెంటనే మంజూరు చేయాలని ఎంటీఎఫ్ పట్టణ కార్యదర్శి కోటన్న, నాయకులు అనిల్‌కుమార్, దస్తగిరి, బసవరాజ్ కోరారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్ వివరాలు తెలియకపోవడంతో వార్షిక ఇంక్రిమెంట్‌లు, స్పెషల్‌గ్రేడ్ పే, ఇతర అరియర్స్ బిల్లులు మూడు నెలలుగా నిలిచిపోయాయన్నారు. కేడర్స్ స్ట్రెంత్ వివరాలను అధికారులకు అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు చంద్రమౌళి, ప్రతాప్‌రెడ్డి, సురేష్‌కుమార్, నూర్‌హుల్‌హక్, ఆనంద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి భజన పోటీలు

ఆస్పరి: తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలముని స్వామి, నల్లారెడ్డి స్వామి 33వ ఆరాధనోత్సవాల సందర్భంగా సోమవారం రెండు తెలుగు రాష్ట్రాల వారికి భజన పోటీలు నిర్వహించనున్నట్లు ఆదివారం గ్రామ పెద్దలు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా ఆర తులం బంగారం, తర్వాతి స్థానాల వారికి వెండి 30 తులాలు, 25 తులాలు, 20, 15, 12, 11, 10, 9, 8, 5 తులాలు చొప్పున అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ 98492 81708, 90003 71857 నంబర్లను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ ఆదోని ఇన్‌చార్జ్‌గా దేవిశెట్టి

కర్నూలు(సెంట్రల్): ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్‌ను నియమించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తూరు సత్యనారాయణగుప్తా, కర్నూలు నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఎస్.ప్రమీలను నియమించారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు ఈ మూడు నియామకాలు చేపట్టినట్లు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

త్యాగరాజ స్వామి సంగీత కచేరి

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి సంగీత కచేరి జరిగింది. ఆదివారం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో నాయిబ్రాహ్మణ సంఘం ఆర్గనైజర్స్ రామాంజనేయులు, హరిబాబు నేతృత్వంలో సంగీత కచేరి నిర్వహించారు. ఆంధ్రరత్న నేషనల్ అవార్డు గ్రహీత మాస్టర్ కాకర్ల ఈశ్వరయ్య చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది. అనంతరం ఈశ్వరయ్యను నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు, ఆర్గనైజర్లు శాలువా, పూలమాలలు వేసి నగదు బహుమతితో సన్మానించారు. ప్రతిభ కనబరిచిన సక్సఫోన్, డోలు, తబల మాస్టర్లను సత్కరించారు. నాయకులు శాంతప్ప, వెంకటేష్, నరసింహులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు



గాయపడిన లక్ష్మిరెడ్డి

హొళగుంద: స్థానిక కన్నడ ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న లక్ష్మిరెడ్డి ఆదివారం కర్ణాటక రాష్ట్రం బెళగల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దివ్యాంగుడైన సదరు టీచరు పని నిమిత్తం సిరుగుప్పకు వెళ్లి తిరిగి వస్తుండగా బెళగల్ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి ప్రమాదం జరిగడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ముక్కు, మొహం మీద రక్త గాయాలు కావడంతో స్థానికులు బంధువులకు సమాచారమిచ్చి 108లో ఆదోనికి తరలించారు.

వైఎస్ చలువతోనే పులికనుమ ప్రాజెక్టు

ఎమ్మిగనూరుటౌన్: దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే పులికనుమ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగిందని, టీడీపీ ప్రభుత్వం చేపట్టిందనడంలో వాస్తవం లేదని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తేల్చిచెప్పారు. ఆదివారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో బీడు భూములకు సాగునీరందించాలనే ఉద్దేశంతో 2006లో సూగూరు రిజర్వాయర్ ప్రారంభోత్సవంలో పులికనుమ ప్రాజెక్టు నిర్మాణం గురించి నాటి మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి దృష్టికి తాను స్వయంగా తీసుకెళ్లానన్నారు. దీంతో అప్పటికప్పుడు ప్రాజెక్టు మంజూరు చేస్తామని వైఎస్సార్ హామీ ఇచ్చారన్నారు. దీంతో పులికనుమ ప్రాజెక్టు ప్రక్రియ ప్రారంభమై తానే అధికారులతో అంచనాలు రూపొందించి పంపడంతో రూ.261 కోట్లను వైఎస్సార్ కేటాయించారన్నారు. ఈమేరకు 21-9-2008న పులికనుమ ప్రాజెక్టు ఎత్తిపోతల పథక నిర్మాణానికి ఎమ్మిగనూరు పట్టణంలో మహానేత వైఎస్సార్ పైలాన్‌తో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో ఎల్లెల్సీ నుంచి పులికనుమ ప్రాజెక్టుకు కాలువ నిర్మాణం పూర్తిచేయలేకపోగా చివరి ఏడాదిలో కేవలం రూ.25 కోట్లు కేటాయించిందన్నారు. పులికనుమ ప్రాజెక్టు నేడు పూర్తయిందంటే అది దివంగత మహానేత వైఎస్సార్ చలవే అన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు సున్నం కొట్టి తామే పూర్తి చేశామని ప్రచారం చేసుకోవడం ప్రజలందరికీ తెలుసన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి



సుభాష్ చంద్రబోస్ చేతులమీదుగా గ్రంథాలయ సభ్యత్వం స్వీకరిస్తున్న రుద్రగౌడ్

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని ఈ మేరకు ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని స్వీకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ సూచించారు. ఆదివారం పట్టణంలోని లైబ్రరీలో 'గ్రంథాలయాల అభివృద్ధి-ప్రజల భాగస్వామ్యం' అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రూ.100 చెల్లించి సభ్యత్వం స్వీకరించి గ్రంథాలయ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. వార్త పత్రికలు, మొదలుకొని నిరుద్యోగులకు పోటీ పరీక్షల మెటీరియల్ వరకు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను ప్రజలకు పూర్తిగా అందుబాటులోకి తెచ్చేందుకు డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీర శైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్, మాజీ కౌన్సిలర్ ఇక్బాల్, గ్రంథాలయాధికారి హరికృష పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చీల అభివృద్ధికి కృషి

ఆలూరు: రాయలసీమ జిల్లాల్లోని సీఎస్ఐ చర్చీల పరిధిలో కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని రాయలసీమ సీఎస్ఐ చర్చీల చైర్మన్ డాక్టర్ రెవరెండ్ ఐసక్ వరప్రసాద్ తెలిపారు. ఆలూరు సీఎస్ఐ చర్చీ ఆవరణలో ఆదివారం పాస్టర్ దేవదానం ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన క్రైస్తవ మతస్తులను ఉద్దేశించి మాట్లాడారు. తాను బాధ్యతలను స్వీకరించిన నాటి నుంచి అభివృద్ధి పనులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐసక్ వర ప్రసాద్ సతీమణి భారతి, రాయలసీమ డయాస్ చర్చీల కోశాధికారి మేరీ సుకుమార్, క్రైస్తవ మత పెద్దలు దేవసహాయం, ఏసురత్నం, రాజశేఖర్, సుందరరాజ్ తదితరులు బిషప్‌ను ఘనంగా సన్మానించారు.

దేవరగట్టులో విశేష పూజలు



మాళమల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని విరాట్ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు స్వామివారి మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతితో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఈనెల 29, 30 తేదీల్లో తిరుపతిలో జరిగే ఏపీ హమాలీ సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె.లలితమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ఉప కార్యదర్శి ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు.